# బహుమతి

## కొడుముది శ్రీరామచంద్రమూర్తి

ది వెస్ట్ గోదావరీ టొబాకో కంపెనీ, మా ఊళ్లోకల్లా చాలా పెద్ద పొగాకు కంపెనీ. మన దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం ఎప్పుడో బ్రిటీషువాళ్లు దానిని తమ్మిలేరు వొడ్డున స్థాపించారు. జీలకర్ర గూడెం, జంగారెడ్డిగూడెం మొదలైనచోట్ల పొగాకు కొని, లారీల్లో ఏలూరు తీసుకువచ్చి, గోడౌన్లలో స్టాక్ చేసి, పై నుంచి ఆర్డర్లు సంపాయించి, ఎక్స్‌పోర్ట్ చేసేవాళ్ళు. 1947 తర్వాత తెల్ల దొరలు మెల్ల మెల్లగా ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోయారు. వాళ్ల స్థానాల్లోకి, నార్త్ ఇండియా నుంచి రాజస్థానీ లొచ్చారు. వ్యాపారంలో వాళ్ళు తెల్లవాళ్లను మించి పోయారు. రైతులకు అప్పులిచ్చి చేనుమీదనే పొగాకును కొనేసి, రైతునూ పొలాన్నీ కూడా తమ గుప్పిట్లోకి లాగేసుకున్నారు. కంపెనీ పక్కనున్న ఖాళీ స్థలాల్ని చౌకగా స్వంతం చేసుకుని, వరుసగా బేరన్లు కట్టారు. బయ్యర్స్‌ని అప్పాయింట్ చేశారు. కూలీల్ని పెట్టి, పొగాకును మండెలుగా కట్టించి, నాటు పొగాకును చుట్టల కంపెనీలకూ, నశ్యం కంపెనీలకూ సప్లయ్ చేసి, వర్జీనియా పొగాకును రష్యాకూ, చైనాకూ పంపి తిమ్మిని బమ్మిని చేశారు.

మొదట్లో ది వె. గో. టొ. కం. ఎగుమతులమీదనే తన దృష్టి కేంద్రీకరించింది. కానీ ఇప్పుడది ఒక్క ఎక్స్‌పోర్ట్స్ విషయంలో నే కాదు, లోకల్ మార్కెట్‌లో కూడా వొక బలీయమైన సంస్థగా రూపొందింది. వనవిహారీ చంపాలాల్‌జీ వచ్చింతర్వాత, ఆయన అధ్యక్షతలో మా కంపెనీ మరింతగా విస్తరణ కార్యక్రమానికి పూనుకొంది. లాభాలు నూటికి నూరు శాతం ఎక్కువయ్యాయి. అయినా మా అధ్యక్షులకు సంతృప్తిగా లేదు. ఇంకా ఇంకా కంపెనీని విస్తరించాలి. దక్షిణ భారత దేశాన్నంతా తన పరిధిలోకి తెచ్చుకోవాలి. కంపెనీలో ఇంకా నలభై శాతం వాటాలు కొంతమంది ఇంగ్లీషువాళ్ల చేతుల్లోనే, ఇన్‌డైరెక్టుగా ఉన్నాయి.

ఆ వాటాల విషయం మాట్లాడ్డానికీ, కొత్త పథకాల గురించి చర్చించడానికీ చంపాలాల్‌జీ నెల రోజుల క్రితం ఇంగ్లండు వెళ్లారు.

ఇవ్వాళో రేపో ఆయన తిరిగి వచ్చేస్తున్నారు.

రాగానే ఆయనకు ఎట్లా స్వాగతం చెప్పాలి? ఏ రకంగా సత్కారం చెయ్యాలి? ఎంత పెద్ద పూలదండ వెయ్యాలి?

నిన్నా మొన్నా మా కంపెనీలో మా అందరిమధ్యా ఇదే చర్చనీయాంశం, నిజానికి వాళ్ళ కందరకూ తెలుసు. నేను 'సెంటర్ ఆఫ్ ది స్టేజ్'లో ఉండటానికి ఆరాటపడే మనిషిని కానని. పైగా వాళ్లందర్లోకీ నేనే సీనియర్‌మోస్ట్‌ను కూడా! ఇరవై ఆరో ఏట మా కంపెనీలో చేరాను. ఇరవై నాలుగేళ్ళనుంచీ పని చేస్తున్నాను. భగవంతుడి దయవల్ల వో మాటా - పలుకూ లేకుండా నెగ్గుకొస్తున్నాను. నేను గ్రాడ్యుయేట్ని కూడా కాదు. ఉత్త మెట్రిక్యులేట్ని మాత్రమే! డిస్పాచ్ సెక్షన్‌లో చేరి, అప్పర్ డివిజన్ క్లర్క్‌నై, ఇంత కాలానికి నేనూ ఓ ఉద్యోగస్థుణ్ణి అనిపించుకో గలుగుతున్నాను. ఇంకో అయిదేళ్ళల్లో రిటైరయిపోతాను. మిగిలిన ఉద్యోగస్థులకున్న పెద్ద పెద్ద కోరికలేవీ నాకు లేవు.

పెద్దమ్మాయికి పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించేస్తేనూ, ఉన్న ఒక్కగా నొక్క వంశోద్ధారకుడికీ వో ఉద్యోగం చూసి వాణ్ని ఓ గాడిలో పడేస్తేనూ, ఈ జీవితానికి నాకు చాలు.

పెంకుటిదే అయినా, చిన్నదే అయినప్పటికీ, తల దాచుకోటానికి ఓ కొంపంటూ వుంది. అది సరిపోతుంది. నేనూ మా ఆవిడా గుట్టుగా కాలక్షేపం చేయడానికి. ఈ దేశంలో ఉన్న కోట్లాది దిగువ మధ్య తరగతి సంసారాల్లో మాదీ వొకటి.

"ఎడ్వాన్సెస్" అన్న ఫైలు మూసేసి, "అమ్మయ్య" అనుకుని కాస్త టీ తాగొద్దామని క్యాంటీనుకు బయలుదేర బోతుండగా, ఇంటర్ కామ్ లోంచి మానేజరుగారి గొంతు వినిపించింది.

"వెంకట శివయ్యా! చైర్మన్ గారు మధ్యాహ్నం ఫ్లైట్‌కు విజయవాడకు వచ్చేసి, అయిదింటికల్లా కంపెనీలో ఉంటార్ట! హైదరాబాదు నుంచి ఫోనొచ్చింది!"

దాంతో టీ తాగడం కూడా మానుకుని రిసెప్షన్ హడావిడిలో పడిపోయాను. కంపెనీ ముందు "వెల్‌కమ్ టు అవర్ రెస్పెక్టెడ్ ఛైర్మన్" అన్న బోర్డు రంగుల కాయితాలలో అటూ యిటూ తోరణాలు, కంపెనీ మెయిన్ డోర్ దగ్గర్నించి గేటు దాకా ఎర్ర తివాచీ, దానిమీద అక్కడక్కడా పువ్వులో ముగ్గులు....

వనవిహారీ చంపాలాల్‌జీ అదంతా చూడగానే ముగ్ధులై పోయారు. ఆయన మొహం మీద దరహాసం మెదిలింది. ఆయన నున్నని ఎర్రటి బట్టతల నీరెండలో ఎర్రగా మెరిసింది. కళ్ళు చేపల్లా కదిలాయి.

మేనేజరు గారు ఆయనకు దండ వేశారు. సెక్షన్ హెడ్స్ పుష్ప గుచ్ఛాలు సమర్పించారు. స్టాఫ్ ఎసోషియేషన్ సెక్రటరీ స్వాగత పత్రం చదివాడు. అందరూ అన్ని పనులూ చేస్తుంటే, నేను దూరంగా నుల్చుండి పోయాను, అన్నీ చూస్తూ! చంపాలాల్‌జీ తన ఛేంబర్స్‌లోకి వెళ్ళిం తర్వాత, కంపెనీలో ఉన్న ముఖ్యమైన వ్యక్తులందర్నీ, ఒక్కొక్కర్నీ పిలిపించి మాట్లాడి పంపించేస్తున్నారు

నా టేబిలు దగ్గర నే నొక్కడ్నే వచ్చే పోయే వాళ్ళను విష్ చేస్తూ కూచున్నాను. నేనేం ఐ. పీ.సీ, వి ఐ. పీ.సీ కాదు.... అయినా నేను ఇంటికి వెళ్ళిపోతే బావుండదు. ఛైర్మన్ గారు ఇంకా ఛేంబర్స్‌లో ఉండగానే, నేను ఆఫీసు వదిలిపెడితే మర్నాటికల్లా ఊస్టింగ్ ఆర్డర్స్ రావడం ఖాయం!

ఆలోచిస్తూ కూచున్న నా దగ్గరకు వరహాలు వచ్చాడు. వరహాలు ఛెయిర్మన్ గారి ఛేంబర్స్ దగ్గర ఉండే జయ విజయుల్లో ఒకడు

వస్తూనే, "అయ్యగారు పిలుస్తున్నారు" అన్నాడు నవ్వు మొహంతో.

"నన్నా?!"

"ఆహా! మిమ్మల్నే!! వెంకట శివయ్య గార్ని పిల్చుకు రమ్మని పేరు కూడా చెప్పారు!" ఆశ్చర్యంతో, అనుమానంతో, లోలోపల రవంత భయంతో, ఛేంబర్స్‌లోకి అడుగు పెట్టాను చెప్పుల్లో కాళ్ళు వణుకుతున్నాయి


నన్ను చూడగానే "రండి, రండి, కూచోండి!" అన్నారు చంపాలాల్‌జీ. అంటే మాత్రం నేను కూచుంటానా? పై అధికారి దగ్గర అణగి మణగి ఉండి, అణకువతో, నుంచుని మాట్లాడితేనే మర్యాదగా ఉంటుందని నాకు జీవితం నేర్పిన పాఠం!

"పర్వాలేద్సార్!" నుంచునే అన్నాను

"మీకో ప్రెజెంట్ ఇద్దామనుకుంటున్నాను!" ఆయన చిరునవ్వుతో అన్నారు.

"ప్రెజెంటా?" పొరపాటుగా విన్నానేమో అనిపించింది

"నా రిసెప్షెన్ ఏర్పాట్లన్నీ మీరే చేశారని తెలిసింది. వెరీ వెల్‌డన్!! చాలా బాగా చేశారు. దేర్‌ఫోర్, మీరేం కోరితే అది ప్రెజెంటుగా ఇద్దామనుకుంటున్నాను కోరుకోండి. మీ కిష్టమైంది, కావాల్సింది, ఏదైనా సరే!"



దేముడు ప్రత్యక్షమై భస్త్రల్సి వరం కోరుకొమ్మన్నట్టుగా ఉంది నా పరిస్థితి.

నెక్స్టు పోస్టుకు ప్రమోషన్ కోరుకోనా?

- ఉహూ, వద్దు, కాలక్రమంతో అదే వస్తుంది

ఓ ఎడ్వాన్సు ఇంక్రిమెంట్ అడిగితే? వెధవది. ఇరవై రూపాయలు   బ్లాంక్ చెక్ లాంటిది ఇచ్చి ఇష్టమొచ్చిన అంకె వేసుకోమంటే, ఇరవై రూపాయలు రాసుకోనా దాని మీద? షేమ్... షేమ్....

ఏం అడగాలో అర్థమై చావడం లేదు. ఆఁ! జ్ఞాపకం వొచ్చింది. రోజూ, అగ్రహారం నుంచి, రెండు గుళ్ళ సందులో నుంచి, కెనాల్ రోడ్డు మీద నుంచి, వసంత మహల్ సెంటర్‌లోంచి, పవర్ ప్రెస్ గేటు దాటి, రమా మహల్ దాటి, గుబ్బల వారి వీధిలో నుంచి, అశోకనగర్ మీదిగా తమ్మిలేరు ఒడ్డుకు నడిచి రాలేక ప్రాణం కడగట్టి పోతోంది.

సాయంకాలం ఇంటికి వచ్చి ఉస్సురుస్సురనుకుంటూ పడక్కుర్చీలో కూలబడి విసనకర్రతో విసురుకుంటున్నప్పుడల్లా మా ఆవిడ అంటుంది 'ఉసూరు మనుకుంటూ అంత దూరం నుంచి అట్లా చెమటలు కక్కుకుంటూ నడిచిరాకపోతే, ఓ సైకిలు కొనుక్కోరాదుటండీ?"

కొనుక్కుందామనే నాకూ ఉంటుంది, కానీ వెయ్యి రూపాయలు ఒక్కసారిగా ఎక్కణ్నుంచి తెచ్చేటట్టు? ఏ సైకిలు షాపు వాడు కూడా వాయిదాల పద్ధతి మీద ఇచ్చి చావడే?

తల వంచుకుని మెల్లగా అన్నాడు, "మీరేం అనుకోకపోతే, వో సైకిలు కొనిపెట్టండి!

"సైకిలా?!" చంపాలాల్‌జీ ప్రశ్నార్థకంగా, ఆశ్చర్యంతో చూశారు. నా వైపు.

"ఈ వయసులో మీరు సైకిలు తొక్కుతారా?

ఒక్క క్షణం తర్వాత నా అభ్యర్థనలో ఉన్న ఔచిత్యాన్ని అర్థం చేసుకున్నట్టుగా ఆయన తల పంకించారు. "ఒకే! అట్లాగే కొనుక్కోండి! మీ ఇల్లు మన కంపెనీకి చాలా దూరం అని విన్నాను ఓ సైకిలుంటే, శ్రమా తగ్గుతుంది, టైముకూ రాగల్గుతారు. నైస్ ఐడియా!"

ఇంత కాలానికి నా కోరిక నెరవేరబోతోంది కదా అని సంతోష పడుతూ, ఆయనకు మరీ మరీ థ్యాంక్స్ చెప్పి, ఆ సాయంకాలం ఆఘమేఘాల మీద ఇంటికి చేరాను. ఇంటావిడతో అన్ని విషయాలూ చెప్పాను, కించిత్ గర్వంతో.

అంతా విని, పెదవి విరుస్తూ, "బంగారం లాంటి అవకాశం వొస్తే, మీ రిట్లా పప్పులో కాలేశారేం? అన్నది సత్యవతి, కొంచెం నిష్ఠూరంగా

"అదేమిటే, సైకిలడగడం పొరపాటా?'

"మీ క్కావల్సింది, ఏదైనా సరే కోరుకోండి, అని చంపాలాల్ గారన్నప్పుడు, ముష్టి వెయ్యిరూపాయల సైకిల్టండీ కోరుకునేది? మీతెలివి తెల్లారకపోతేనూ!!"

"సైకిలు కాకపోతే," ఓ చిన్నసైజు హెలికాప్టర్ కొనిపెట్టండి సార్!' అని అడగ మంటావా? "మా ఆవిడ ఆకాశంలో ఎగరాలని మోజుపడుతోంది' అని"

తన చేతిలో ఉన్న కాఫీకప్పు నా చేతికిస్తూ లాలనగా అన్నది సత్యవతి. నాకేం ఆకాశంలో కెగరాలని లేదండీ! కాళ్ల కింద ఉన్న నేల గట్టిగా ఉంటే, అదే పదివేలు!"

"నీ మనసులో ఉన్నదేవిటో నాకు ఒక్క ముక్క తెలసి చావడం లేదు!"

"నేను శుభం మాట్టాడుతుంటే, చావులంటారేవిటండీ? ఇంకో అయిదారేళ్ళల్లో మీరు రిటైరవుతున్నారు. అవునా? ఇంతవరకూ అమ్మణ్ణికి మనం పెళ్ళి చెయ్యలేదు, ఎందుకని? మీది వంటి రెక్క కనుక!! అయినప్పుడు మీ రెక్కకు మరో రెక్క తోడైతే మన ఇబ్బందులు గట్టెక్కవూ?

"తోడైతే బాగానే ఉంటుంది! ఎట్టాగూ అని?"

"కావల్సింది కోరుకోమని ఆ చంపాలాల్ గారన్నప్పుడు, "మా అబ్బాయికి ఉద్యోగం వేయించండీ! అని మీ రొక్కమాటంటే సరిపోలా?"

"నిజమే సుమా!" సత్యవతి తెలివితేటలకు విస్తుబోయాను. "వెధవది, సైకిలు మీదకు మనసు పోయింది కానీ, అబ్బాయి ఉద్యోగం సంగతి జ్ఞాపకం రాలేదు!"

"అదేనండీ ఆడవాళ్ళకూ, మగవాళ్లకూ తేడా! మాకు ఇల్లే కైలాసం! మీకు ఒళ్ళే వైకుంఠం!"

"వైకుంటమూ లేదు, వల్లకాడూ లేదు కాని, రేప్పొద్దున్నే వెళ్ళి అయన్నడుగుతాను. నాకు సైకిలొద్దూ మా వాడికి ఉద్యోగం వెయ్యండీ అని!"

ఆ మాటతో సత్యవతి మొహం వికసించింది.

కానీ ఆమాట విన్న చంపాలల్‌జీ గారు ఒక్కక్షణం ఆలోచిస్తూ అట్టే ఉండిపోయారు. "ఓకే! మిస్టర్ వెంకట శివయ్యా! నిన్న సాయంకాలం మీకు రాలేదు ఈ ఆలోచన! ఉదయ్యాని కల్లా మీ కోరిక మారిపోయింది. అంటే ఇంట్లో వాళ్ళ అభిప్రాయం అన్న మాట అది" ఐ అండర్‌స్టాండ్ దెమ్!!

అట్లాగే మీ వాడికి ఉద్యోగం ఇస్తాను!! నా దగ్గర పని చేసే వాళ్ళ అభిప్రాయాన్ని నేనెప్పుడూ గౌరవిస్తాను!"

"థ్యాంక్యూ, థ్యాంక్యూ సార్ !!" నా గొంతు గద్గదికమైంది కృతజ్ఞతతో.

"కానీ మీకు తెలియని రూలొకటుంది కంపెనీలో! ఆ రూలు మీ కిష్టం అయితే."


ఆయన అర్ధోక్తిలో ఆగిపోయారు. ఏరూలైనా సరే, మా వాడికి ఉద్యోగం వస్తే, ఏ నిబంధనకైనానేనొ డబడతాను. అందుకని ధైర్యంగా అడిగాను, "ఏవిటాసర్ ఆరూలు?"

"ఒక ఇంటో ఇద్దరికి మేం ఉద్యోగాలివ్వం!"

మై గాడ్! ఇదెక్కడిరూలు? రాష్ట్ర ప్రభుత్వం లో నే మామగారు ముఖ్యమంత్రైతే, ఒక అల్లుడు గారు రాష్ట్రమంత్రిగా, మరో అల్లుడు గారు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా, ఓ కొడుకు ముఖ్యమంత్రి గారి చైతన్య రధ సారధిగా, మరో కొడుకు ఆయన పదవికి వారసుడిగా ఉంటున్నప్పుడు లేని ఉభ్యంతరం, ఓ పొగాకు కంపెనీలో నేనూ, మా అబ్బాయీ గుమాస్తాలుగా పని చేస్తే వచ్చిందా?

నేను ఆలోచనలో పడడం చూసి చంపాలాల్‌జీయే మళ్ళీ అన్నారు, "మీరు వలంటరీగా రిటైరైతే, మీ ప్లేస్‌లో మీ కొడుక్కి ఉద్యోగం ఇవ్వటానికి నాకేం అభ్యంతరం లేదు!"

ఆలోచించాను, ఆలోచించాను, ఆలోచించాను, నా కనిపించింది, నేనస్తమించే సూర్యుణ్ని, మా వాడు ఉదయించే సూర్యుడు. నేను పనిచేసేది, మహా అయితే, ఇంకో అయిదేళ్ళు. మా వాడికే ఉద్యోగం వస్తే, వాడు పనిచేస్తే, వాడు పనిచేసేది ముప్పై అయిదేళ్లు!




చంపాల్‌జీ షరతుకు ఒప్పుకోవడమే మంచిదనిపించింది. "సరేసర్! అట్లాగే చెయ్యండి, నేను రిటైర్ అవుతాను, మా వాడికి ఆ ఉద్యోగం ఇప్పించండి!"

"రిటైరవుతున్న ఉద్యోగికి, రిటైర్‌మెంటు ప్రెజెంట్ కింద సైకిల్ కూడా ఇస్తున్నాను, తీసుకోండి!" అన్నారు చంపాలాల్‌జీ ఉదారంగా.

నాకు విచారం కన్నా ఆనందమే ఎక్కువగా కలుగుతోంది. నాకుద్యోగం పోతేఏం, కన్నబిడ్డకు ఉద్యోగం వస్తోంది. బహుమతి ఇచ్చి సగౌరవంగా నన్ను సాగునంపుతున్నారు చంపాలాల్‌జీ. అంతకన్నా ఏం కోరుకోవాలి నేను?

"ఓరి పిచ్చి వెంకట శివయ్యా! ఓల్డ్ పీపుల్ని వదిలించుకోడానికి మేనేజ్‌మెంట్ వేసిన ప్లానయ్యా ఇది" ఇవ్వాళ నువ్వు, రేపు నేను!!" అన్నాడు మేనేజరు విచారంగా మొహం పెట్టి. "నీకంటే ఓ కొడుకున్నాడు, వాడికి ఉద్యోగం వస్తోంది, నాకు అందరూ కూతుళ్ళేనే!!"

"ఏం వాళ్ళకు ఉద్యోగం ఇవ్వరా?"

"పెళ్ళి చేయాల్సిన పిల్లచేత ఉద్యోగం ఏం చేయించనయ్యా?"

అయితే నేనే లక్కీ అన్న మాట!! మా ఆవిడ సత్యవతి కూడా "మనం లక్కీయేనండీ!" అన్నది, "చంపాలాల్‌జీకి చెయ్యెత్తి దణ్ణం పెట్టుకోవచ్చు!"

"ఆఁ! పెట్టుకోవచ్చు. పెట్టుకోవచ్చు...!" మా వాడు ఖస్సు మన్నాడు.

"ఎందుకురా అంత కోపం? ఉద్యోగాలంత సులభంగా దొరుకుతున్నయ్యనుకుంటున్నావేమిట్రో మీ నాన్నగారు వద్దనుకుంటే, నీ కొచ్చింది తెలుసా?"

"తెలుసు, తెలుసు- ఆ కంపెనీలో ఇంతోటి గమాస్తా ఉద్యోగానికి నాన్నగారి త్యాగమొకటీ మధ్యలో!" వాణ్ణి అంకుశానికి తీసుకు రావటానికి నానా యాతనా పడవలసి వచ్చింది. నేను బతిమలాడాను, వాళ్ళమ్మ ఏడ్చింది, వాడి అక్కయ్య వాదులాడింది. ఎట్టాగైతేఏం, చిట్ట చివ్వరికి సరేనన్నాడు.

చంపాలాల్‌జీ ఇచ్చిన కొత్త సైకిలు వాడికిచ్చి, "వెళ్ళిరా, బాబూ!" అని వాణ్ని పంపించాను, వాడు ఉద్యోగంలో చేరే రోజున.

సైకిల్నొక తన్ను తన్ని, విసుక్కుంటూ దాన్నెక్కి వెళ్ళిపోయాడు వాడు.

ఆ సైకిల్ను వాడు తంతే, నా గుండెల మీదనే తన్నినట్టుగా ఉంది నాకు. నా ఇరవై నాలుగేళ్ల సర్వీస్‌కు గాను చంపాలాల్ జీ, ఫారిన్ నుంచి రాగానే ఆదరపూర్వకంగా నాకు ఇచ్చిన బహుమతి!' దాని విలువ వాడికేం తెలుసు!

ఆ సైకిలు విలువే కాదు, ఊరికే వచ్చిన ఉద్యోగం విలువా వాడికి తీలీదు. పిచ్చి వెధవ!

ఏమైతే ఏం, మొహం మొట మొట లాడించు

కుంటూనే, రోజూ పదింటి కల్లా సైకిలెక్కి వాడు ఆఫీసుకు వెళ్ళి పోతున్నాడు. సాయంకాలం ఆరు దాటిం తర్వాతే ఇంటి కొస్తున్నాడు.

మొదట్లో గుడిబండగా ఉన్నా, మొదటి నెల జీతం అందుకున్న తర్వాత, అదే తొక్కుడు లడ్డూ కన్నా తియ్యగా వుంటుంది.

మధ్యాహ్నం పూట వాడు ఇంటికి రాడు. కంపెనీ క్యాంటీన్‌లో నే ఏదో కాస్త ఎంగిలి పడతాడు. పదింటి కల్లా భోంచేసి అమ్మణ్ని ఎంబ్రాయిడరీ నేర్చుకో టానికి వెళ్ళి పోతుంది. ఆంధ్రప్రతికను 'అ' నుంచి 'క్ష' దాకా తిరగేసి, నేను ఒంటిగంట దాటింతర్వాత భోజనం చెయ్యడానికి అలవాటు పడుతున్నాను. తొందరగా తినేస్తే మాత్రం చెయ్య వలసిన రాచ కార్యాలేమున్నాయి గనుక?

ఆ రోజు నేనూ– సత్యవతీ, వాడి ఉద్యోగం గురించీ, పెద్దదానికి చూడవలసిన సంబంధాల గురించీ ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ, మెల్లగా భోంచేస్తున్నాము.

బయటి నుంచి "వెంకటశివయ్య గారూ!" అన్న కేక.

"కూర్చోండి, వస్తున్నాను!"

"కూర్చోటానికి టైం లేదు. ఛైర్మన్ గారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు! వస్తాను!" అతడు వెళ్ళిపోయాడు.

"ఏమండీ..!" సత్యవతి కంఠంలో వణుకు. "ఈ టైంలో ఆయన మీకు కబురు చేశారంటే, నాకేమిటో భయంగా ఉందండీ! మన వాడేమన్నా పిచ్చి పని చెయ్యలేదు కదా?"

"వాడి విషయం అయి వుండదు. నువ్వేం కంగారు పడకు. మనవాడికి ధూకుడెక్కువైనా, కూచున్న కొమ్మ నరుక్కునే తెలివి తక్కువ వాడేం కాదు!"

అన్నానే కాని, నాకూ లోపల బితుకు బితుకు మంటూనే వుంది. మా వాడి కూడా వేలాది మంది యువకుల్లాగానే, జీవితాన్ని వీలయినంత అనుభవిద్దామనే కోరికే తప్ప, ఆ అనుభవానికి తనకున్న అర్హత ఎంత? అనే ఆలోచన లేదు. గుమాస్తా బతుకంటే గొర్రె తోక జీవితం అని వాడి అభిప్రాయం. చంపాలాల్‌జీ లాంటి వాళ్ళు జలగలనీ ఓ ధృఢమైన నమ్మకం. వాళ్ళు జలగలే కావచ్చు, ఈ సమాజంలో వాళ్ళతోనే సహజీవనం చేయాలి. అదే తెలీదు మా అబ్బాయి లాంటి వాళ్ళకు!

నన్ను చూడగానే చంపాలాల్‌జీ గాఢంగా నిట్టూర్చి అన్నాడు. "వెంకటశివయ్య గారూ, భలే బహుమతి ఇచ్చారండీ మీరు నాకు!"

ఆయన వేపు అలా చూస్తూ నుంచుండిపోయాను. ఆయనే మళ్ళీ గంభీరంగా అన్నారు, పని నేర్చుకుంటాడు కదా అని డిస్పాచ్ సెక్షన్‌లో వేస్తే, కాన్ఫిడెన్షియల్ పేపర్స్ తీసుకు వెళ్ళి ప్రెస్సు వాళ్ల కిస్తాడా? అన్‌గ్రేట్‌ఫుల్ రాస్కెల్!! అందుకనే డిస్మిస్ చేశాను!!"

"నాకు తల పాతాళంలోకి కుంగిపోతున్నది. నా నిజాయితీ, విధేయత, ఇరవై నాలుగేళ్ల నా సర్వీస్, అంతా, అంతా, మట్టి పాలైపోయింది. "క్షమించండి! ఒక్క అవకాశం నాకిప్పించండి! ఆ పేపర్స్ వాడి దగ్గర్నించి నేను తీసుకు వస్తాను!"

చంపాలాల్‌జీ నా వేపు నిశితంగా చూశారు. "ఓకే! తీసుకు రండి!! తీసుకు వస్తే మీరు ఊహించలేని బహుమతి మీ కిస్తాను. మీ ఉద్యోగంలో మిమ్మల్ని రీ అప్పాయింట్ చేస్తాను!"


బహుమతి ఉద్యోగం. రీ అప్పాయింట్‌మెంట్... తల వూపి తడబడుతున్న అడుగులతో బయటకు వచ్చేశాను.

ప్రెస్ క్లబ్ దగ్గర కొందరు గుమిగూడి తమలో తాము ఆందోళనగా గుసగుసలుగా మాట్లాడు కొంటున్నారు. నా బహుమతి సైకిల్ వో పక్కన పడి వుంది. నన్ను చూడగానే, "ఇదేమిటి సార్ ఇక్కడికి వచ్చారు? – హాస్పిటల్‌కు వెళ్ళకుండా! సైకిల్ ఎక్కడికి పోతుంది? మేం లేమూ?" అన్నాడు వాళ్ళల్లో ఒకడు.

"మీ వాడికి యాక్సిడెంట్ అయింది కదుటండీ? ఏఎన్‌డబ్ల్యు 9999 గుద్దేసి వెళ్ళిపోయింది!" ఏఎన్‌డబ్ల్యు 9999!! ఏఎన్‌డబ్ల్యు 9999!!! ఏఎన్‌డబ్ల్యు 9999!!!! అది మా కంపెనీ కారే! ఆ కారేమిటి? మా వాణ్ని గుద్దేసి ఎస్కేప్ అయిపోవడమేమిటి? అంతా అయోమయంగా ఉంది. కింద పడిపోయిన సైకిలేసుకుని హాస్పిటల్‌కు వెళ్ళాను. మా వాడికి, ఆక్సిజన్ సిలెండరు కావాలన్నారు ఎమర్జెన్సీ ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఓ వెయ్యి రూపాయలు ఖర్చవుతుందన్నారు...

వెయ్యి రూపాయలు... ఎకడ్నుంచి తీసుకు రాను? – బలవంతంగా రిటైర్ చెయ్యబడ్డవాణ్ని"

"వెధవ సైకిలు అమ్మేద్దురూ? పిల్లవాడి ప్రాణం కన్నా మనకా సైకిలెక్కువేమిటి?" ఏడుస్తూనే సలహా చెప్పింది సత్యవతి.




ఆ సైకిల్ చూసి షావు వాడన్నాడు, "దెబ్బ తిన్న సైకిలుకు వెయ్యి రూపాయ లెవరిస్తారండి బాబూ? ఓ అయిదొంద లిస్తాను, అక్కడపెట్టి పొండి!"

"వద్దు బాబూ, నీ అయిదొంద లొద్దు. ఆ అయిదొందలతో నా కొడుకు నాకు దక్కడు. సైకిలిచ్చిన మా రాజునే అడుగుతాను. నా కొడుకు ప్రాణం కాపాడమని బ్రతిమలాడుకుంటాను. ఆయన కంపెనీ కారేగదా, నా బిడ్డను ఆస్పత్రి పాల్జేసింది? ఆ మాత్రం దయ చూపించడా ఆపెద్ద మనిషి?"

దయ చూపించడం సరే, నన్ను చూడగానే కళ్ళెర్రజేస్తూ అడిగారు చంపాలాల్‌జీ,

"ఏవయ్యా ఆ పేపర్స్?"

"పేపర్స్ సంగతి తర్వాత బాబూ, ముందు మా వాడి ప్రాణం కాపాడండి! ఓ వెయ్యి రూపాయ లిప్పించండి!" నా కళ్లల్లో నీళ్ళు ఆగడం లేదు.

"నాకా పేపర్స్ ముఖ్యం! నీ కుర్రవాడి ప్రాణం కాదు!! "నాది వ్యాపార సంస్థ! ధర్మసత్రం కాదు."

"పోనీ, మీరు బహుమతిగా ఇచ్చిన సైకిల్ వాపస్ తీసేసుకునీ, అందుకు బదులుగా ఓ వెయ్యి రూపాయలిప్పించండి బాబూ!"

చంపాలాల్‌జీ నా వేపు ఎర్రగా చూశారు. పక్కనే ఉన్న బంట్రోతుతో అన్నారు, "ఒరేయ్, ఆ సైకిలు కూడా లోపలపెట్రా!"

అన్యాయం చంపాలాల్‌జీ, ఇదన్యాయం!! నా పిల్లవాడి ప్రాణం కాపాడవలసిన ఆ సైకిలును మీరు లాగేసుకుంటే, నేనేం పెట్టి నా బిడ్డను బ్రతికించుకోను? కనీసం, కనీసం, మీ కంపెనీ కారు కిందే పడ్డ నా కొడుక్కి నష్ట పరిహారంగానైనా ఆ సైకిలును ఇప్పించేయండి బాబూ! ఇంకెక్కడైనా అమ్ముకుంటాను, వచ్చినంతే తీసుకుంటాను, మిగిలిం దానికి నా తల తాకట్టు పెట్టుకుంటాను."

చంపాలాల్‌జీ భళ్ళున నా మొహం మీదే తలుపేసుకున్నారు. బంట్రోతు నా దగ్గరకు వచ్చి మెల్లగా అన్నాడు, "వెళ్లండి శివయ్య గారూ! తలుపులు మూసుకున్న గుడి ముందు ఎంత సేపు ఏడ్చి లాభం? ఆసత్రి దగ్గరకైనా వెళ్ళి, అబ్బాయి గారైనా దక్కించుకోండి!"

ఆస్పత్రిలో దిగాలు పడ్డ నన్ను చూసి, అప్పుడే మన లోకంలోకి వస్తున్న మా అబ్బాయి అంటున్నాడు, "బహుమతి పోగొట్టుకున్నందుకు బాధగా ఉందా నాన్నా?" జవాబు చెప్పేటంతలో, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ వచ్చి – మా వాడికి ఓ బుకేను ఇచ్చి–

"హార్టీ కంగ్రాట్స్ యంగ్‌మాన్" నీ పేపర్స్‌తో ఓ దగుల్బాజీ కంపెనీ గుట్టు రట్టవుతోంది" అన్నాడు.

"లేదురా, బాధగా లేదు. నేను గెల్చుకుని పోగొట్టుకున్న బహుమతి కన్నా, నీ ప్రాణాల్ని పణంగా పెట్టి నువ్వు గెల్చుకున్న బహుమతే గొప్పదిరా!!" అన్నాను గర్వంగా!! సత్యవతి నా వేపు మెచ్చుకుంటున్నట్టుగా చూసింది. అమ్మణ్ణి సరేసరి, పిచ్చిపిల్ల, ఒకటే సంబరం దానిది" □